

పశువులకు వైద్య పరీక్షలు
చేయించాలి

కందుకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు రైతులు వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శ్రావణ్‌కుమార్ కోరారు. బుధవారం జైత్వారంలో మండల వెటర్నరీ డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో 105 పశువులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ పర్వతాలు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, స్థానికులు

పేదలకు ఇళ్ల స్థలాలు
చూపాలి

కందుకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల ఆధారంగా పొజిషన్లు చూపాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, సీపీఐ నాయకులు జంగారెడ్డి కోరారు. బుధవారం ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పదహారేళ్ల క్రితం 188సర్వే నంబర్‌లో ప్రభుత్వం 183మందికి, అలాగే 16నెలల క్రితం 107 సర్వే నంబర్‌లో 350 మందికి పట్టాలిచ్చారని తెలిపారు. ఇప్పటిదాక ఒక్కరికీ పొజిషన్ చూపలేదన్నారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ సమస్యను ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రవి, మహేందర్, అరుణ్, చంచల, జ్యోతి, సబియా బేగం, సక్కుబాయి, మంగ, శివ పాల్గొన్నారు.

నా మనుమడు ఎక్కడున్నాడో!



నా మనుమడు రవి మూడు రోజులుగా కనిపించడం లేదు. పోలీసులు ఎక్కడికి తీసుకెళ్లారో తెలియదు. మేం ఎవరిని కలవాలో తెలియడం లేదు. తిరుపతిరెడ్డి సార్‌ను అడిగేందుకు ఇక్కడికి వచ్చాం. నా మనవడిని విడిపించాలని కోరుతున్నాం.

- అనంతమ్మ, లగచర్ల



లగచర్లలో దిగులుగా కూర్చున్న మహిళలు

భయం గుప్పిట్లోనే..!

లగచర్ల ఘటనతో ఆ రెండు గ్రామాలు



- అరెస్టులతో ఉలికిపాటు
- పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్‌తో ఆందోళన
- ఎప్పుడు ఎవరిని అరెస్టు చేస్తారోనని భయం
- రోటిబండ తండాలో ఇంకా ఇళ్లకు చేరుకోని జనం
- లగచర్లలో ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్న ఇళ్లు

కొడంగల్/బొంరాస్‌పేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనతో కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ తండావాసులు భయాందోళనకు గురవుతున్నారు. దుద్యాల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ (ఫార్మా క్లస్టర్) ఏర్పాటుకు భూసేకరణపై ప్రజాభిప్రాయం నిర్వహించేందుకు వెళ్లిన జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై జరిగిన దాడి ఘటనతో రెండు రోజులుగా స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులపై దాడి చేసిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నం కావడంతో ఎప్పుడు ఎవరిని అరెస్టు చేస్తారోనన్న భయం వారిలో వ్యక్తమవుతోంది. దాడి ఘటనతో మంగళవారం లగచర్ల,

మిగతా 7వ పేజీలో..

కొనుగోళ్లు వేగిరం చేయాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు పీఏసీఎస్ 20, డీసీఎంఎస్ 7, ఐకేపీ 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నట్లు తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి 42 మంది రైతుల ఖాతాల్లో రూ.57.73 లక్షలు జమ చేసినట్లు చెప్పారు. ఇంకా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఏఈవోలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాలు గుర్తించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని సూచించారు. అలాగే 15 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 1186 మంది రైతుల ద్వారా 7951 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసి, 39 మంది రైతుల ఖాతాల్లో రూ.89.84 లక్షల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతీ ఎన్యూమరేటర్ తమ పరిధిలోని ఏ ఒక్క ఇంటిని విడిచి పెట్టకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వేలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, సీపీవో సౌమ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, పౌరసరఫరాల డీఎం గోపీకృష్ణ, డీఎఫ్‌వో శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి, డీఈవో సుశీందర్‌రావు

బాలికలు ఆత్మ విశ్వాసంతో
ముందుకు సాగాలి

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి ఉన్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి అన్నారు. రాజ్యాంగ పరమైన హక్కులు ఉపయోగించుకొని సర్వతోముఖాభివృద్ధి సాధించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అధికరణ 21-ఏ ద్వారా విద్య ప్రాథమిక హక్కుగా మారిందని, విద్యా హక్కు చట్టం కింద ప్రతీ ఒక్కరికి ఉచిత నిర్బంధ విద్య అమలులో ఉందన్నారు. బాల్య వివాహాలు నేరమని, వీటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఈవో సుశీందర్‌రావు మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీహెచ్.రవి మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్యా నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోప్యాయులు రవీందర్, కె.రవి పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్వర్యంలో గత 15 రోజుల క్రితం ఉమ్రా యాత్రకు వెళ్లిన యాత్రికులు బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా స్వాగతం పలికారు. మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాల నుంచి 50 మంది యాత్రికులు .పవిత్ర మక్కా, మదీనా ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనాలు చేశారని చెప్పారు. ప్రపంచ దేశాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన చెప్పారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రతలు తీసుకోవడం జరిగిందన్నారు. పవిత్ర మక్కా, మదీనా ప్రార్థన మందిరాలను సందర్శించడం చాల సంతోషంగా ఉందని యాత్రికులు పేర్కొన్నారు.

జాతరకు వేళాయే

రేపటి నుంచి బుగ్గక్షేత్రంలో ఉత్సవాలు



కోనేరులో కొలువైన ఉత్సవమూర్తులు

మంచాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పిలువబడే బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. కార్తీక పౌర్ణమి మొదలుకొని అమావాస్య వరకు పక్షం రోజుల పాటు ఈ ఉత్సవాలు సాగుతాయి. ఉత్సవమూర్తులైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు ఇక్కడి కోనేరులో కొలువై ఉంటారు. ఇక్కడి కోనేరులో నీటి ప్రవాహానికి ప్రత్యేకత ఉంది. కోనేరులో నీటి ప్రవాహం తూర్పు నుంచి పడమరకు వచ్చి సమీపంలోని కొండల్లో మళ్లీ తూర్పు వైపునకు దిశను మార్చుకుంటాయి. ఈ పవిత్ర జలాల్లో పుణ్యస్నాణాలు ఆచరిస్తే మంచి జరుగుతుందనే భక్తులు నమ్మకం ప్రతియేటా కార్తీక మాసంలో 15 రోజుల పాటు బుగ్గ జాతర జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక స్నానాలు ఆచరిస్తారు. వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రానికి స్వస్థలాలకు తిరిగి వెళ్తారు.

కార్తీక ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కాగా ఇప్పటిదాకా ఈ ఉత్సవాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఇటీవల బుగ్గ క్షేత్రం దేవాదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. దీంతో అధికారులు ఉత్సవాలు ఏర్పాట్లు చేశారు. వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి బుగ్గక్షేత్రంలో మౌలిక వసతులు కల్పించారు. ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రతి రోజు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ఇంకా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు ఏర్పాటుచేశారు.

బుగ్గజాతరకు ఎలా వెళ్లాలంటే..

హైదరాబాద్ నగరానికి 45 కిలోమీటర్ల దూరంలో శ్రీ బుగ్గరామలింగేశ్వర క్షేత్రం ఉంది. ఇబ్రహీంపట్నం మీదుగా మంచాల, ఆరుట్ల మీదుగా బుగ్గక్షేత్రానికి చేరుకోవచ్చు. ఇంకా చౌటుప్పల్ వైపు నుంచి వచ్చే భక్తులు కొయ్యలగూడెం, రాచకొండ మీదుగా ఆరుట్ల రావచ్చు. దండుమైలారం వైపు హైదరాబాద్-విజయవాడ రహదారిపై నుంచి వచ్చే భక్తులు దండుమైలారం, తిప్పాయిగూడ మీదుగా ఆరుట్ల రావచ్చు. అలాగే యాచారం-సాగర్ రహదారిలో వచ్చే భక్తులు గున్‌గల్-రంగాపూర్-జాపాల మార్గంలో బుగ్గక్షేత్రానికి చేరుకోవచ్చు.



ఆరుట్ల సమీపంలోని బుగ్గరామలింగేశ్వర క్షేత్రం

అందరి అభిప్రాయాలు
పరిగణిస్తాం

బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రజలందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తామని కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం బహిరంగ విచారణను నిర్వహించింది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల నేతలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుంచి వినతి పత్రాలను, సలహాలను, సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు లోబడి రిజర్వేషన్ల అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. బహిరంగ విచారణలో ప్రజల నుంచి ఎంతో విలువైన సమాచారం లభించిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంతో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నెల రోజుల్లో ప్రభుత్వానికి సమగ్రనివేదిక సమర్పిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి సైదులు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీపీఆర్వో వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అపోహలూ వద్దు: కలెక్టర్ నారాయణరెడ్డి

సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి అపోహలు వద్దని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. జిల్లాకు విచ్చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి సైదులకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. పబ్లిక్ హియరింగ్ అనంతరం ఆయన మాట్లాడారు. సమగ్ర వివరాల కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు దగ్గర ఉంచుకుని పూర్తి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సంచార జాతులు పనిచేస్తున్న చోటే వివరాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బీసీ కులాలే కాదు.. అన్నికులాల వారి వివరాలను సమగ్ర కుటుంబ సర్వేలో సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎవరేమన్నారు..

బీసీ కుల గణనలో విశ్వకర్మలైన (కమ్మరి, వడ్రంగి, కంచరం, శిల్పి, స్వర్ణకార) ఐదు వృత్తిదారులను 'విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ' పదాలను ఒకే కులంగా

మిగతా 7వ పేజీలో...



యాలాల లింగాలు..
కోవూరు జంగాలు

యాలాల చుట్టూ సుమారు 100 రామలింగాలు

- పూర్వకాలం శ్రీరాముడే ప్రతిష్ఠించాడని ప్రతీతి
- తగ్గిన విగ్రహాల సంఖ్య
- ఈ లింగాలపై 30 ఏళ్లక్రితం హైదరాబాద్ వ్యక్తి రీసెర్చ్

6



నీటి కుంట కనుమరుగు

- ఆపదలో ఫార్మాసిటీ భూమిలోని నీటి వనరు
- బండరాళ్లు వేసిన కాంట్రాక్టర్
- పోలేకపోతున్న పశువులు, మనుషులు

8

శిథిలావస్థలో
వ్యవసాయ కార్యాలయం

పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు.. ఇబ్బంది పడుతున్న అధికారులు, రైతులు

చేవెళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాలకులు, అధికారులు నిర్లక్ష్యం, పట్టింపులేకపోవడంతో చేవెళ్ల వ్యవసాయ డివిజన్ కార్యాలయం సొంత భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం చేవెళ్ల బీడీవో క్వాటర్స్‌లో కార్యాలయం కొనసాగుతుంది. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు కార్యాలయంలోని ఫైల్స్ కూడా తడిచి పోయాయని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పట్టపగలే పాములు, ఎలుకలతో పాటు విష పురుగులు తిరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ డివిజన్ కార్యాలయ పరిధిలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు వస్తారు. ప్రస్తుతం ఉన్న భవనం ఇరుకుగా ఉండటంతో పది మంది రైతులు కూడా కూర్చునే పరిస్థితి లేదు. కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. భవన నిర్మాణం కోసం పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలప్పుడు చేవెళ్ల వ్యవసాయ డివిజన్ కార్యాలయ సొంత భవనం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ కూడా ఇచ్చారు. ప్రసుత్తం ఉన్న కార్యాలయ పక్కనే ఉన్న ఖాళీస్థలాన్ని భవన నిర్మాణం కోసం అప్పట్లో ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలంలో కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.



చేవెళ్ల వ్యవసాయ డివిజన్ కార్యాలయం

ప్రత్యేక భవనం నిర్మించాలి



చేవెళ్ల డివిజన్ కేంద్రంలో రైతులకు, అధికారులకు ఉపయోగపడేలా వ్యవసాయ కార్యాలయ కొత్త భవనం నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రసుత్తం ఉన్న భవనం గట్టిగా వర్షాలు కురిస్తే కూలిపోతుంది. స్థానిక ఎమ్మెల్యే స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

- కె. రామస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

యాలాల లింగాలు.. కోవూరు జంగాలు

- యాలాల చుట్టూ సుమారు 100 రామలింగాలు
- పూర్వకాలం శ్రీరాముడే ప్రతిష్ఠించాడని ప్రతీతి


యాలాల మండల కేంద్రంలోని ఓ రైతు పొలంలోని లింగం


యాలాల నుంచి గోవిందరావు పేట వెళ్లే రోడ్డు మార్గంలో

యాలాల, నవంబరు 13 : యాలాల గ్రామం రామలింగాలకు ప్రతీక. గ్రామం చుట్టూ ఎక్కడ చూసినా రైతుల పొలాల్లో రామలింగాలే దర్శనమిస్తాయి. అందుకేనేమో ఈ గ్రామానికి 'యాలాల లింగాలు.. కోవూరు జంగాలు' అని నానుడి ఉంది. వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి శ్రీరాముడు వచ్చి గ్రామం చుట్టూరా రామలింగాలను ఏర్పాటు చేశారని ఈ గ్రామ ప్రజల నమ్మకం. అప్పట్లో గ్రామం చుట్టుముట్టు గల రైతు పొలాల్లో దాదాపు 100 రామలింగాలు ఉండేవని, కొన్ని లింగాలను ఇతర ప్రాంతాల వ్యక్తులు తీసుకెళ్లారని చర్చించుకుంటున్నారు.

మ్యూజియంలో భద్రపరచి..

మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ అధికారి ఇక్కడి లింగాలను తీసుకెళ్లి అక్కడి మ్యూజియంలో భద్రపర్చారని పేర్కొంటున్నారు. 30 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి యాలాలకు వచ్చి ఇక్కడి లింగాలపై రీసెర్చ్ కూడా చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వందల సంవత్సరాల నుంచి గ్రామం చుట్టూ వందల సంఖ్యలో లింగాలున్నాయి. రాను రాను వాటి సంఖ్య తగ్గిపోయింది. కొన్ని లింగాలు భూమి లోపలికి కూరుకుపోగా, మరికొన్ని లింగాలు ఇతర ప్రాంతాల వ్యక్తులు తీసుకుపోగా, ప్రస్తుతం పొలాల్లో అక్కడక్కడ మాత్రమే రామలింగాలు దర్శనమిస్తున్నాయి.

బంగారాన్ని రాశులుగా పోసి..

యాలాలతోపాటు యాలాల అనుబంధ గ్రామమైన గోవిందరావు పేట చుట్టూ కూడా లింగాలు ఉన్నాయి. యాలాల, గోవిందరావుపేట గ్రామాల్లో అప్పట్లో అత్యధికంగా చిన్న చిన్న గుడులు కూడా ఉండేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కాగా ఆ గుడులన్నీ ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఒకప్పుడు యాలాలో బంగారాన్ని రాశులు పోసి అమ్మే వారని నానుడి. ఇప్పటికీ కొన్ని శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో బంగారం ఉన్నట్లు స్థానికులు నమ్ముతుంటారు. కాగ్నా నది గ్రామం చుట్టూ ప్రవహించడంతో శ్రీరాముడు ఈ ప్రాతానికి వచ్చి రామలింగాలు ఏర్పాటు చేసుకుని పూజలు చేసుకుని ఉండొచ్చని చరిత్రకారులు చెబుతున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

తీర్పు వెల్లడించిన ఎల్‌బీనగర్ కోర్టు

చేవెళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడికి పోక్సో యాక్ట్ కింద 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ స్పెషల్ కోర్టు న్యాయాధికారి హరీష బుధవారం తీర్పు ఇచ్చారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం బాకాపూర్‌నకు చెందిన వడ్డె ప్రకాశ్(27) డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు 2017లో ఓ బాలికను అపహరించి లైంగికదాడి చేశాడని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం కోర్టులో కేసు తుది విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడు వడ్డె ప్రకాశ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని సీఐ వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన్‌కల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

సనాతన ధర్మం కాపాడటానికి ఆత్మాహుతికైనా సిద్ధం

- అఘోరీ నాగసాధు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలో అఘోరి హల్‌చల్


కారులో కర్పూరం వెలిగించి ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరిస్తున్న అఘోరీ

శంషాబాద్/శంషాబాద్ రూరల్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఎయిర్‌పోర్టు నిర్వాసితులకాలనీలో దుండగులు ధ్వంసం చేసిన హనుమాన్‌మందిరంలోని నవగ్రహాలను బుధవారం అఘోరీనాగసాధు సందర్శించారు. విగ్రహాలను దుండగులు ధ్వంసం చేయడంపై అఘోరీ అసహనం వ్యక్తం చేశారు. విగ్రహాలు ధ్వంసం చేసిన ప్రాంతంలో అఘోరీ ఆయుధ పూజలు నిర్వహించారు. ఆ తరువాత నవగ్రహాల చుట్టూ ప్రదక్షణ చేశారు. ఆ తరువాత తన చేతికి ఉన్న గాజులను పగులగొట్టింది. ఒంటికాలు పై నిలబడి ఏదో చదువుతూ పూజలు చేసింది. ఆ తరువాత మీడియాతో మాట్లాడింది. సనాతన ధర్మం కాపాడటం కోసం ఈ పోరాటం చేస్తున్నానని చెప్పారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన, గో హత్యలు చేసిన నిందితుల మర్మాంగం కోసివేస్తానని చెప్పింది. సనాతన ధర్మం కాపాడటానికి ప్రయత్నిస్తున్న తనను ఎవరూ అడ్డుకున్నా సహించనని హెచ్చరించారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులకాలనీ నుంచి జూకల్ లోని చౌడమ్మ, సోమన్న దేవాలయాలను సందర్శించేందుకు వెళ్తానని చెప్పిన అఘోరీని పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో ఆమెను చూడటానికి కాలనీవాసులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకి చేరుకున్నారు. జనం ఆమె కారును చుట్టుముట్టడంతో ఆమె తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆమె కారు నుంచి కిందకు దిగడానికి ఇష్టపడలేదు. తనను అడ్డుకుంటే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరించారు. హిమాలయ పర్వతాల్లో ఉన్న తన గురువు ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నానని ఆయన నుంచి ఆజ్ఞ రాగానే దేవాలయాలపై జరిగిన దాడులకు నిరసనగా తాను ఆత్మాహుతి చేసుకుంటానని ప్రకటించారు. దీంతో ఆ ప్రాంతంలో మరింత ఉద్రిక్తత నెలకొంది. అక్కడ గుమిగూడిన ప్రజలను పంపించడానికి పోలీసులు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. దాదాపు రెండు గంటల పాటు అఘోరి కారులోనే కూర్చుంది. తనను కిందికి దిగమని ఎవరైనా అడిగితే వెంటనే లోపలి నుంచి కారు డోర్‌ను పెద్దగా కొడుతూ శబ్దం చేస్తూ కారులో ఉన్న కర్పూరం వెలిగిస్తూ కారు ముందుభాగంలో ఉన్న పురైలకు హారతి ఇస్తూ.. దాని పక్కను ఉన్న పెట్రోల్ డబ్బాను చూపుతూ ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరించి హల్‌చల్ చేసింది. ఆ తరువాత జూకల్‌లోని ఆలయాలు చూడటానికి బయలుదేరివెళ్లింది.


ధారూరు మెథడిస్టు జాతరలో వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

ధారూరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సందర్శించారు. వైద్య శిబిరంలో నిల్వ చేసిన వివిధ రకాల మందులను, రిజిష్టర్‌ను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులు అనారోగ్యానికి గురైతే వారికి సకాలంలో వైద్యం అందించాలని ఆయన వైద్యాధికారి శివ శంకర్‌కు, సిబ్బందికి సూచించారు.

ఫార్మా రైతులపై కేసులు ఎత్తివేయాలి

పరిగి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫార్మా రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బహుజన ముక్తి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, బీఎంపీ జిల్లా నాయకులు నేనావత్ హరినాయక్‌లు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న నిరుపేద రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. లగచర్లలో అర్ధరాత్రి రైతులను అరెస్టులు చేసి గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొల్పడం సమంజసం కాదన్నారు.

కొనసాగుతున్న మెథడిస్టు జాతర

- ఆకర్షణీయంగా జాతర ప్రాంగణం
- దుకాణాలు, హోటళ్లతో సందడి వాతావరణం


ధారూరు మెథడిస్టు జాతరలో వెలిసిన దుకాణాలు

ధారూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతర కొనసాగుతోంది. రెండోరోజు జాతర ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపార దుకాణాలు వెలిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కిరాణ, పిల్లల ఆట సామగ్రి, శీతల పానీయాలు, మాంసాహార హోటళ్లు, ప్లాస్టిక్ బిందెలు, మట్టి కుండలు, బట్టలు, స్వెటర్లు, బొంగులు, పట్నాలు, బతానీలు, చాయ్ దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. మరి కొన్ని దుకాణాలు వెలుస్తున్నాయి. కాగా బుధవారం జాతరలో భక్తుల రద్దీ తక్కువగా కనిపించింది. శుక్రవారం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, గుల్బార్గా, చించోలి, కుంచారం తదితర ప్రాంతాల నుంచే కాక, జహీరాబాద్, మెదక్, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి పాదయాత్ర ద్వారా భక్తులు జాతర ప్రాంతానికి చేరుకోనున్నారు. శనివారం, ఆదివారాలలో క్రైస్తవ భక్తులతో జాతర ప్రాంగణం పోటెత్తనుంది.

పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలి


సదస్సులో మాట్లాడుతున్న లఖన్ టక్కర్

శామీర్‌పేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు పొదుపు చేస్తు బ్యాంకుల్లో రుణాలను పొంది పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదగాలని ఆనంద్ రాఠి వెల్త్ సీనియర్ ఉపాధ్యక్షుడు లఖన్ టక్కర్ పిలుపునిచ్చారు. శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్‌లో డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల ఆర్థిక, విద్యపై ఒకరోజు అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలు పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో నెలకు రూ. 500 పొదుపు చేసుకునే భవిష్యనిధిని తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. ఐపీఈ క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకై ఐపీఈ సంస్థ సహాయ సహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఐపీఈ అకాడమి డీన్ ఆచార్య శ్రీకాంత్, తదితర అధ్యాపకులు సదస్సులో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎనర్జీ ఉస్మానియ ముఖ్య సలహాదారు ఆచార్య సురేందర్‌రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సమగ్ర సర్వే


సర్వేపై వృద్ధురాలికి వివరిస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, సర్వే అధికారులకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం అమీర్‌పేటలో సర్వేను తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. సర్వే ఈ నెల 30నాటికి పూర్తవుతుందన్నారు. పేదలకు, వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా మరింత తోడ్పాటు అందించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ సర్వేకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేపై విపక్షాలు రాద్ధాంతం చేయకుండా మేధావులు, సామాజికవేత్తలు, కుల సంఘాలు సహకరించి సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే నవంబరు 14 నుంచి డిసెంబరు 9 వరకు రాష్ట్రంలో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలన ఏడాది పూర్తి కానున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలనతో ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే కుల గణన సర్వే సైతం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు.

బుగ్గజాతరలో రాజకీయాలొద్దు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మంచాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బుగ్గజాతరను రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆరుట్ల అఖిలపక్ష నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. బుధవారం బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, డీఎస్పీ నాయకులు బుగ్గజాతరలో అవినీతి, ఇతర సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా బుగ్గజాతరను పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అయితే ఈ ఏడాది జాతరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎండోమెంట్ పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారితో అధికారులు సైతం అంటకాగుతున్నారని విమర్శించారు. ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శ్రవణ్, రాము, జంగయ్య, నూకం రవి, నూకం రాజు, రఘుపతి, జానీ పాషా, అశోక్, బుచ్చయ్య, వంశీ పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసం మండలం చేయాలి



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవల సౌకర్యార్థం గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి, సమీప గ్రామాల వాసులు చేస్తున్న రిలే నిరశన దీక్షలు బుధవారం 13వ రోజుకు చేరాయి. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్బులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీతండాలతో గట్టిప్పలపల్లిని మండలం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీక్షలో జేఏసీ కన్వీనర్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, ఎల్లయ్య, నారయ్య, శేషనాయక్, రాజు, యాదగిరి, సురేశ్, వెంకటయ్య, గోవింద్, రత్నయ్య, అంజయ్య మోహన్, రామచంద్రయ్య,రామస్వామి, సురేశ్, రాజశేఖర్, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి పుస్తకాలు చదివి మేధోశక్తిని పెంచుకోవాలని కందవాడ మాజీ ఉపసర్పంచ్ కావ్యకృష్ణాగౌడ్ అన్నారు. బుధవారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ నిర్వాహకులు రూ.30వేల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కావ్య మాట్లాడుతూ.. ఈ కాలంలో విద్యార్థులు పూర్తిగా సెల్‌ఫోన్లకే అలవాటు పడి పుస్తకాలు చదవడం లేదన్నారు. ఈ పరిస్థితిని గుర్తించే జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థతో మాట్లాడి పుస్తకాలు ఇప్పించాం అన్నారు. స్కూల్ లైబ్రరీ నిర్వహణకు భారీగా పుస్తకాలు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, టీచర్లు మధుసూదన్ రెడ్డి, రజని, దర్శన్‌గౌడ్, లాయర్ కృష్ణాగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

డీఎం అండ్ హెచ్‌వో వెంకటరమణ



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పెద్దేముల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మంచి వైద్యం అందించాలని డీఎం అండ్ హెచ్‌వో వెంకటరమణ వైద్యులకు సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని ఆయన బుధవారం పరిశీలించారు. కొత్త భవనంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా? అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలో 170 రకాల మందులు ఉన్నాయని, కుక్కకాటుకు సైతం మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇక్కడ ఇమ్యూనైజేషన్ 100శాతం జరుగుతోందని, ఓపీ పేషంట్ల సంఖ్య బాగానే ఉందన్నారు. సబ్‌సెంటర్లలో కూడా ఏఎన్ఎంలు సమయపాలన పాటించాలని సూచించారు.


గుడిసెలేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం అదేస్థలంలో పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో సీపీఐ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నంబర్ 75లో గుడిసెలేసుకొని ఉంటున్న పేదలకు పట్టాలిస్తే వారు ఇళ్లు కట్టుకుంటారని అన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుభరోసా ఇచ్చి పెట్టుబడి సాయం అందించాలని కోరారు. సీపీఐ శతజయంతి ఉత్సవాలను శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు మంజుల, కృష్ణాగౌడ్, మక్బుల్, సత్యనారాయణ, యాదగిరి, శ్రీనివాస్, యాదయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై సినిమా షూటింగ్



వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతగిరికి వెళ్లే మార్గంలో అడవిలో నడిరోడ్డుపై సినిమా షూటింగ్ జరిగింది. సినీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న ఓచిత్రానికి సంబంధించి యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ క్రమంలో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కార్తీక మాస జాతర సందర్భంగా అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళుతున్న భక్తులను షూటింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, మీరు ఆగిపోవాల్సిందే అంటూ దబాయించడంతో ప్రయాణికులు ఏంచేయలేక ఉండిపోయారు.

ఖాజాగూడ కొత్త చెరువు

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

అక్రమ నిర్మాణాలకు కూల్చరాదన్న ఉత్తర్వులు వర్తించవని స్పష్టీకరణ



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని కొత్తచెరువు ఆక్రమణల తొలగింపునకు చట్టప్రకారం తక్షణం చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ, హైడ్రా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితరులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఆక్రమణలపై వినతిపత్రాలు సమర్పించినా చర్యలు తీసుకోవడం లేదని దాఖలైన పిటిషన్‌ను ఎందుకు అడ్మిట్ చేసుకోరాదో వివరించాలంటూ ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్లు ఇప్పటికే రెండుసార్లు అధికారులకు విజ్ఞప్తులు అందజేసిన నేపథ్యంలో చట్టప్రకారం సంబంధిత అన్ని పార్టీలకు నోటీసులు జారీ చేసి కొత్తచెరువు శిఖం లేదా ట్యాంక్‌బెడ్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఖాజాగూడ పరిధిలోని సర్వే నంబర్ 5లో 5.25 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొత్తచెరువు ఎఫ్‌టీఎల్‌లో బిల్డింగ్ రూల్స్ జీవో 168కి విరుద్ధంగా పలువురు ప్రైవేటు పార్టీలకు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారని పేర్కొంటూ చుట్టుపక్కల పట్టా భూములున్న ఆర్.రామకృష్ణ సహా మరో ఐదుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమంగా జారీ చేసిన భవన నిర్మాణ అనుమతులతో ఇప్పటికీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే తమ అనుమతిలేకుండా దేశంలో ఎక్కడా నిర్మాణాలు కూల్చరాదని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని.. అయితే ఈ ఆదేశాలు అక్రమ నిర్మాణాలకు వర్తించవని ధర్మాసనం స్పష్టతఇచ్చింది. జలవనరులు, నదీగర్భాలు, ఫుట్‌పాత్‌లు, రైల్వే ఆస్తులు, ప్రభుత్వ ఆస్తులు, రోడ్లు వంటి ప్రాంతాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చవచ్చని తెలిపింది. ఈ మేరకు ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 26కు వాయిదా వేసింది.

జీవోలు తెలుగులో ఇచ్చేలా ఆదేశాలివ్వాలంటూ పిల్..

జీవోలు, వివిధ శాఖల మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు, ఆర్డినెన్స్‌ల భాష విషయంలో అధికార భాషల చట్టం-1966కు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. చట్టప్రకారం జీవోలు సహా అన్ని ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులో ఉండేలా ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన జి.ఉమామహేశ్వర్‌రావు పిల్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.



అవార్డు అందుకుంటున్న గంపవెంకటేశ్

ప్యాక్స్ చైర్మన్‌కు అవార్డు

ఆమనగల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్ నాబార్డ్ అధికారుల నుంచి అవార్డు అందుకున్నారు. తమిళ నాడులోని మధురైలో నాబార్డ్ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల డీసీసీబీ చైర్మన్లు, డైరెక్టర్లకు మూడు రోజులు శిక్షణిచ్చారు. బుధవారం శిక్షణ ముగింపు సందర్భంగా నాబార్డు అధికారులు భూపేందర్‌సింగ్, ఉడిత్‌ల నుంచి డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో వెంకటేశ్ అవార్డు అందుకున్నారు. ప్యాక్స్ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. డీసీసీబీ ఉమ్మడి జిల్లాలో రైతులకు అందిస్తున్న సేవలను నాబార్డు అధికారులు ప్రశంసించారని వెంకటేశ్ పేర్కొన్నారు.

సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సర్వే నోడల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కుటుంబసర్వే, ధాన్యం సేకరణ అంశాలపై కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ప్రత్యేకాధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేలో అందుబాటులో లేని కుటుంబసభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో పెట్టుకునేలా ఎన్యుమరేటర్ల ద్వారా ఇంటింటికి తెలిపేందుకు చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులకు సూచించారు. తప్పులు జరుగకుండా చూడాలని, ఏదైనా సందేహం ఉంటే సూపర్‌వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ఉన్నందున సర్వే పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవోలు సైదులు, శ్యాంప్రకాష్, డీఆర్‌వో సాంబశివరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, వ్యవసాయాధికారి చంద్రకళ, డీఎస్‌వో సుగుణబాయి, జిల్లా యువజన అధికారి గోపాల్‌రావు, జిల్లా అధికారులు ప్రశాంత్, బాబు మోసిస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా క్యాంటీన్లు భేష్..!

మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్లు భేషుగ్గా ఉన్నాయని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్, కలెక్టర్ గౌతమ్‌లు కొనియాడారు. బుధవారం వారు మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా క్యాంటీన్‌ను పరిశీలించి ఆహార పదార్థాలు రుచి చూసి మహిళలను అభినందించారు. క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేవిధంగా చూస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందరి అభిప్రాయాలు పరిగణిస్తాం

(5వ పేజీ తరువాయి)

పరిగణించాలని విశ్వకర్మ సంఘం జిల్లా కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మాచారి, రాష్ట్ర మనుమయ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ 'బుసాని'ని కోరారు. పూసల కులానికి 17 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రాజకీయంగా గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, పూసల సంఘం నాయకుడు సదానందం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌ను కోరారు. తక్కువ కుటుంబాలున్న కులాలకు రిజర్వేషన్లలో ప్రాధాన్యత కల్పించాలని సీపీఐఎం నాయకుడు పడగాల యాదయ్య కోరారు. వడ్డెరులకు రానున్న స్థానిక సంస్థల్లో ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని వడ్డెర సంఘం నాయకులు మాగయ్య, బి. రవి కోరారు. మేదరులకు వెదురు బొంగులు ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని, రాజకీయంగా గుర్తించాలని, చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని సంఘం నాయకులు గంగాధర్, ఉమ, హన్మంత్, శ్రీనివాస్ కోరారు. బీసీ లెక్కలు తేలాకే స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘం నాయకుడు మల్లేష్ యాదవ్ కోరారు. తమిళనాడులో బీసీలకు 69 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని, తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి స్వర్ణచారి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, తెలంగాణ సంచార జాతుల సంఘం నాయకులు నరేందర్, రజక సంఘం నాయకులు సాంబరాజు కుమార్, వీరముష్టి కులానికి చెందిన నాయకుడు గండి స్వామి, వీరముష్టి కులానికి చెందిన నాయకుడు గండి స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకుడు మదిలేటి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లోనే..!

(5వ పేజీ తరువాయి)

రోటిబండ తండావాసులు భయంతో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. కేవలం మహిళలు, వృద్ధులు మాత్రమే గ్రామంలో ఉన్నారు. అయితే, గురువారం మాత్రం లగచర్ల గ్రామంలోకి కొందరు జనం వచ్చారు. రోటిబండ తండాలోని పరిస్థితిలో మాత్రం ఏమాత్రం తేడా లేదు. ఇక్కడ జనం ఇంకా ఇళ్లకు వచ్చేందుకు జంకుతున్నారు. అర్ధరాత్రి వచ్చి తమ పిల్లలను పోలీసులు అదుపులోకి తీసుకు వెళ్లడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు రెండు రోజులుగా దిగులుతోనే గడిపారు. కొందరైతే అన్నపానీయాలకు దూరంగా ఉన్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు ఏ తప్పూ చేయలేదని, ప్రభుత్వానికి విన్నవించి వారిని విడుదల చేయించాలని బుధవారం లగచర్లలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిర్మానుష్యంగా మారిన లగచర్ల, రోటిబండ తండాల్లో బుధవారం భయాందోళన ప్రభావం కొంత తగ్గింది. దుకాణాలు తెరుచుకొని ప్రజలు వీధుల్లో కనిపించారు. ఎప్పుడేమవుతుందోననే ఆందోళన అక్కడి వారిలో వ్యక్తమవుతోంది. ఎప్పుడు పోలీసులు వచ్చి అరెస్టు చేస్తారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్నెట్ సేవలు బంద్

లగచర్లలో సోమవారం ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి భూ అభిప్రాయ సేకరణలో భాగంగా అధికారులపై జరిగిన దాడి సంఘటనతో గత మూడు రోజులుగా ఇంటర్నెట్ సేవలను పోలీసులు బంద్ చేయించారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండల పరిధిలో సేవలు బంద్ చేశారు. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులతో పాటు ఇతర ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఇంటర్నెట్ సేవలను పునఃప్రారంభించాలనికోరుతున్నారు.

నా కుమారుడిని విడిపించండి



చేయని తప్పుకు నా కుమారుడిని పోలీసులు అర్ధరాత్రి వచ్చి తీసుకెళ్లారు. అతడు ఏ తప్పూ చేయలేదు. కుమారుడిని తక్షణమే విడిపించండి.

- మంగమ్మ, లగచర్ల



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

లగచర్ల ఘటనపై ఎంపీ డీకే అరుణ ఆరా

వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్లతో అధిరారులపై జరిగిన దాడి విషయమై బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీ భూసేకరణ, అందుకు సంబంధించిన అంశాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే పరిహారం, తీసుకుంటున్న భూమి వివరాలకు సంబంధించిన విషయాలు చర్చించినట్లు సమాచారం. కాగా, దాడికి గల కారణాలు, ఎవరు దాడిచేసి ఉంటారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి స్థానిక నాయకులు ఉన్నారు.

కేటీఆర్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పరిగిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌రెడ్డిని, ఆయన కుటుంబసభ్యులను అప్రతిష్టపాలు చేసేలా కేటీఆర్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. కొడంగల్ ఫార్మాక్లస్టర్ సీఎం అల్లుడికోసం భూసేకరణ చేస్తున్నారని కేటీఆర్ మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అక్కడ గ్రీన్‌ఫార్మా ఏర్పాటు చేసి కొడంగల్ ప్రాంత యువతకు ఉపాధి కల్పనే రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. సీఎంకి చెడ్డపేరు వచ్చేలా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కేటీఆర్ కుట్ర పన్ని ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ఇతర అధికారులపై దాడి చేయించారని ఆరోపించారు. కేటీఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలను దమ్ముంటే నిరూపించాలని, లేదంటే 24గంటల్లో రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వాస్తవాలను ప్రజలకు వివరించాలని, అధికారులకు అండగా నిలవాలన్నారు.

పథకం ప్రకారమే కలెక్టర్‌పై దాడి

షాద్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడిచేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు తలుచుకుంటే బీఆర్ఎస్ నాయకులను తిరగనివ్వబోమని హెచ్చరించారు. బుధవారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో సీనియర్ నేతలు రఘు, బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడులు చేస్తోందన్నారు. కొందరికి డబ్బులిచ్చి రేవంత్‌రెడ్డిని బూతులు తిట్టిస్తున్నా తాము సంయమనం పాటిస్తున్నామన్నారు. లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు తలంచిన భూసేకరణను అడ్డుకొని కలెక్టర్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. దాడులకు కారకుడైన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

త్రోబాల్ పోటీల్లో పరిగి విద్యార్థి ప్రతిభ



త్రో బాల్ పోటీల్లో పరిగి విద్యార్థి ప్రతిభ

పరిగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జావలిన్ త్రోబాల్ పోటీల్లో పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీయస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న బి.రమణి నగరంలో నిర్వహించిన పోటీల్లో రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా రమణిని కళాశాల ప్రిన్సిపాల్ సునీత పద్మావతి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డేవిడ్‌విల్సన్, అధ్యాపక బృందం అభినందించింది.

దిశా కమిటీ జిల్లా సభ్యురాలిగా లలిత



తాండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దిశా కమిటీ వికారాబాద్ జిల్లా సభ్యురాలుగా తాండూరు పట్టణం వార్డు నెంబరు 23 కౌన్సిలర్ అంతారం లలిత నియమితులయ్యారు. ఆమె వికారాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సభ్యురాలుగా కొనసాగుతారు. తనకు ఈ అవకాశం కల్పించిన సందర్భంగా భారత ప్రభుత్వ విప్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌లకు కృతజ్ఞతలు ఎలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కేఎస్ఆర్ సేవా దళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్‌బాబ అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్య చికిత్సలకు రూ.10లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో జంగారెడ్డిపల్లికి చెందిన జంతుక ఎల్లయ్యకు మంజూరైన రూ.60వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం బాబ అందజేశారు. కార్పొరేట్‌కు వైద్యానికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ రోగులకు వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఎండీ. ఫరీద్, కొండల్, శ్రీనివాస్, మహేశ్, నరేశ్, రమేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

సభ్యత్వ నమోదుకు సహకరించాలి



సభ్యత్వం నమోదు చేయిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రతి కార్యకర్త సహకరించాలని మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదల గుండెల్లో పదిలంగా ఉన్న పార్టీ టీడీపీ అన్నారు. సభ్యత్వం పొందిన కార్యకర్తలకు బీమా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, యాదయ్య, అనంతయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నీటికుంట కనుమరుగు

● ఆపదలో ఫార్మాసిటీ భూమిలోని నీటి వనరు ● బండరాళ్లు వేయించిన కాంట్రాక్టర్ ● పోలేకపోతున్న పశువులు, మనుషులు




పెద్ద పెద్ద బండరాళ్లు వేసి, మట్టి పోస్తూ కుంటను పూడ్చివేయిస్తున్నారిలా..

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిలోని కుంటను కను మరుగు చేస్తున్నారు. గతంలో కుంట వద్ద రోడ్డేసిన కాంట్రాక్టర్ క్రమంగా దానిలో బండరాళ్లు, మట్టి వేసి పూడ్చుతున్నారు. కుంటలోని నీటిని పశువులు, గొర్లుమేకలు తాగేవి. నేడు రాళ్లువేసి కుంటలోకి పశువులే కాదు మనుషులు సైతం వెళ్లలేకుండా చేశారు. రైతులు, పశువులకాపరులు నీటికోసం తంటాలు పడుతూ దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఫార్మాసిటీ నిర్మాణానికి సేకరించిన భూముల్లో రోడ్లు వేసిన కాంట్రాక్టర్ తక్షణమే ఈ కుంటలో ఉన్న బండరాళ్లను తొలగించి నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పశువులు, మేకల కాపరులు, స్థానికులు కోరుతున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

చేవెళ్ల, నంబరు 13(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని చేవెళ్ల మండల పశువైద్యురాలు శిరీష తెలిపారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం చేవెళ్ల మండలం పామెనలో పశువులకు గర్భకోశ వ్యాధులు చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. అలాగే గ్రామంలోని మిగతా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ డాక్టర్ మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉధృతంగా నిర్వహిస్తోందన్నారు. రైతులందరు తప్పకుండా తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. వ్యాధి ఉన్నా లేకున్నా ఈ టీకాలు వేయించాలని సూచించారు. ముఖ్యంగా ఆవులు, గేదలకు ఈ కాలంలో వ్యాధులు ఎక్కువ వస్తాయని, వాటి ఆరోగ్యంపై పశుపోశకులు జాగ్రత్తగా గమనించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులకు చూపించాలని తెలిపారు. పశువైద్యులు గ్రామాల్లోకి వచ్చి టీకాలు వేస్తారని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ వైద్యురాలు జయసుధ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యురాలు శిరీష

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తికి గాయాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):ఇబ్రహీంపట్నం సమీపంలో సుచిరా బార్ వద్ద బుధవారం ఉదయం రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో బైకర్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఇబ్రహీంపట్నం పరిధి ఖానాపూర్‌నకు చెందిన బత్తుల వెంకటేష్(30) తన బైక్‌పై ఖానాపూర్ వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో రూ.6లక్షల చోరీ

షాద్‌నగర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం అన్నారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొక్క లక్ష్మమ్మ భర్త మృతి చెందడంతో ఆమె కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తోంది. ఈ నెల 10న ఆమె బూర్గులలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. బుధవారం వచ్చి చూడగా ఇంటి వెనక తలుపు తెరిచి ఉంది. ఇంట్లో దాచిన రూ.6లక్షలు కనిపించలేదు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

షాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదురుగు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం చిన్నసోలిపేటలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిన్నసోలిపేటలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. పోలీసులు గ్రామానికి చేరుకొని పేకాట ఆడుతున్న ఐదుగురుని పట్టుకున్నామని చెప్పారు. వారి నుంచి నాలుగు సెల్ ఫోన్‌లు, రూ.24వేల నగదు స్వాధీనం చెసుకున్నట్టు తెలిపారు.

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం

చేవెళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్లలో రూ.2కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో 99మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.భారీగా నిధులిస్తూ సీసీ రోడ్లు వేస్తోందన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, ప్యాక్స్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, జి.ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, మాజీ జడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ బి.శైలజాఆగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

25లక్షల చేప పిల్లలు పెంచుతాం



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారి

తలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 650 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాముల్లో ఈ ఏడాది 25లక్షల చేపపిల్లలను వదుత్తున్నామన్నారు. చంద్రధన, తలకొండపల్లి, రాంపూర్ చెరువుల్లో బుధవారం చేప పిల్లలను వదిలారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా వచ్చి మత్స్యకార సంఘ నాయకులు, ఫిషరీస్ జిల్లా అధికారి పూర్ణిమతో కలిసి చేపపిల్లలను వదిలారు. కసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కులవృత్తుల వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. చెరువు, కుంటల మరమ్మతులు చేసి నీటి నిల్వలు పెంచేలా చేస్తామన్నారు. పూర్ణిమ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 802 చెరువుల్లో 90లక్షల చేప పిల్లలను వదుల్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీకాంత్, ఏవో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, కుమార్, సుధాకర్‌రెడ్డి, రాములు, శ్రీనివాసాచారి, యాదగిరి, అజీం, రవి, నరేశ్, సురేశ్, యాదయ్య, పాండు, జనార్ధన్ పాల్గొన్నారు.

మద్దతు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు

తలకొండపల్లి/మాడ్గుల: రైతులకు మద్దతు ఇచ్చేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. రాంపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ.2,320, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ రవి, డైరెక్టర్లు నయీమొద్దీన్, రాజు, శ్రీనివాసులు, జంగయ్య, కృష్ణ, రఘురాములు, హరిమోహన్‌రెడ్డి, డేవిడ్ ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాడ్గులలో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వడ్లను బాగా ఎండబోసి, తాలు లేకుండా ఎగబోసి కేంద్రాలకు తేవాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో గుట్టలు, వెంచర్లకు, పడావు భూములకు రైతుబంధు రాదని, సాగుచేసే రైతులందరికీ మాత్రం రైతు భరోసా ఇస్తామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పట్టాబి, నాయకులు తిరుమల్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎం.రాములు,రమేష్‌గౌడ్,నవీణ్‌గౌడ్, ఎంపీడీవో పద్మావతి, ఏవో అరుణకుమారి, డీసీవో నర్సింగ్‌రావు, సీఈవో యాదయ్య పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ సంబంధాలకు వారధి



విజేతలతో కోర్ డీన్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు

ఆదిభట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహ సంబంధాలనె పెంచుతాయని నారాయణ కళాశాలల బొంగ్లూర్ బ్రాంచ్ కోర్ డీన్ పొల్యాయి శ్రీధర్‌రెడ్డి అన్నారు.కళాశాలల అధ్వర్యంలో జరిగిన అండర్-18 క్రికెట్ టోర్నీలో బొంగ్లూరు బ్రాంచ్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. బుధవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టీమ్‌ను కోర్‌డీన్ అభినందించారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించామని, క్రికెట్‌లో తమ బ్రాంచ్ విద్యార్థులు గెలిచారన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుబ్బారెడ్డి, రామేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వే చేయొద్దని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

శంషాబాద్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి 108 సర్వే నంబర్లో సర్వే చేయొద్దని ప్లాట్ల యజమానుల అసోసియేషన్ సభ్యులు బుధవారం తహసీల్దార్ రవీందర్‌దత్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం మసినేని రాజశేఖర్ రావు, దన్నాడ ఆంజనేయులుయాదవ్, టి.వెంకటేశ్వర్‌రెడ్డిల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు సర్వేకు రాగా తాము అడ్డుకున్నామన్నారు. ఆ భూములపై కోర్టు స్టే ఉందని ప్లాట్ల ఓనర్లు తెలిపారు. తమ భూముల్లోకి వచ్చేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందనగా తహసీల్దార్ సర్వేను నిలిపివేయాలని సర్వేయర్ను ఆదేశించారు.

సీపీఎం గ్రామ కార్యదర్శిగా వెంకటయ్య



తలకొండపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వెంకట్రావ్‌పేటలో బుధవారం సీపీఎం మహాసభలు నిర్వహించారు. కార్మికుల, ప్రజాసమస్యలపై చర్చించారు. అనంతరం సీపీఎం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సీనియర్ నాయకుడు కానుగుల వెంకటయ్య ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యదర్శిని నాయకులు సత్కరించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏరియా కమిటీ సభ్యుడు పిప్పళ్ల శివశంకర్, నాయకుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం శుభపరిణామమని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. శంకర్‌పల్లిలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో బుధవారం జెడ్‌ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్, రౌండ్ టేబుల్ ఇండియా 303 సౌజన్యంతో నిర్మించే తరగతి గదుల నిర్మాణానికి వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేతపాండురంగారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంఈవో అక్బర్, హెచ్‌ఎం వేదశ్రీ, టీచర్లు ఉదయశ్రీ, శోభారాణి పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి పుస్తెమట్టెల వితరణ



కేశంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొండారెడ్డిపల్లికి చెందిన పోలెపోగు లక్ష్మమ్మ-బలరాం దంపతుల కూతురు శిరీష వివాహాన్ని బుధవారం చేశారు. ఈ పెళ్లికి గ్రామస్తులు పల్లె ఆనంద్‌కుమార్, బాలీశ్వర్, శేఖర్ పంతులు, వాణీశ్రీ దంపతులు పుస్తె, మట్టెలు అందజేశారు. శేఖర్‌పంతులు దంపతులు వస్త్రాలు, బియ్యం అందించారు. వివాహానికి సాయం చేసిన వారికి పెళ్లింటి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ కడ్తాల అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్

ఆమనగల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎంఈవో కార్యాలయంలో తపస్ ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లాధ్యక్షుడు కాశీరావు హాజరయ్యారు. అధ్యక్షుడిగా పి.సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శి కె.మల్లికార్జున్, గౌరవాధ్యక్షుడు వి.భాస్కర్, లేడీ వింగ్ కన్వీనర్‌గా పి.మాధవి, కార్యదర్శి గౌరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కాశీరావు, సంఘం నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ సుమరంజిత, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి కలిసి రండి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు కలిసి రావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. దాతల సహకారంతో కళాశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ శ్రీకారం చుట్టడంతో బుధవారం షాద్‌నగర్ యాదవ సంఘం నాయకుడు నడికూడ రఘునాథ్‌యాదవ్ లక్షా 11వేల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కులను ఎమ్మెల్యేకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులే కాకుండా ఇతరులు సైతం సందించి విరాళాలు ఇస్తున్నారని ఆయన అభినందనలు తెలిపారు. జూనియర్ కళాశాల భవన నిర్మాణంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా షాద్‌నగర్ ప్రాంత ప్రముఖులందరి పాత్రా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ డి.బక్కన్నయాదవ్, కాంగ్రెస్ నాయకులు వై.యాదయ్య, బాబర్ ఖాన్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గున్న భీమయ్యయాదవ్, రఘునాయక్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నడికూడ రఘునాథ్‌యాదవ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కొత్తూరు: ఖాజీగూడ తండాలో పూజలు నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ

కేశంపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మనిషికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కేశంపేట అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం చాతుర్మాస వ్రత దీక్ష ముగింపు సందర్భంగా యగ్నం చేశారు. ముఖ్య అతిథిగా అంజయ్య హాజరై మాట్లాడారు. నాలుగు నెలల పాటు దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆలయంలో గీతా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, సజ్జల విశ్వానాథం, యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లలితాంబికాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

కొత్తూర్: రాగ్యాతండా, కొడిచర్లతండా, ఖాజీగూడతండాల్లో బుధవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గిరిజనులు లలితాంబికాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ పూజలు నిర్వహించారు. తన పెళ్లి రోజును పురస్కరించుకుని రాగ్యా తండా ఆలయానికి 25వేల విరాళాన్ని మాజీ జెడ్పీటీసీ శ్రీలత కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, రవి నాయక్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ పద్మారావు, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి, మల్లన్న స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

షాబాద్: హైతాబాద్‌లో మహంకాళి, బీరప్పస్వామి, మల్లన్నస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రామస్తులు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, సత్తయ్య, యాదయ్య, నర్సింహులు, భాస్కరాచారి, మహిపాల్‌రెడ్డి, శంకర్, ఆంజనేయులు, నరేష్‌గౌడ్, రామకృష్ణ, సాయిలు, మల్లయ్యగౌడ్, అంజనేయులు, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: హైతాబాద్‌లో పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

రాజగోపుర భూమి పూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శివ మారుతి గీతా అయ్యప్ప ఆలయానికి రాజగోపురం నిర్మిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ నెల 18న భూమి పూజకు రావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆహ్వానాన్ని అందజేశారు. ఆలీయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి రవిశర్మ, కమిటీ సభ్యులు నందీశ్వర్, డి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ అల్వాల్‌రెడ్డికి సన్మానం



అల్వాల్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాదెపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతిఅల్వాల్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అభినందించారు. చైర్మన్‌గా తొలిసారి వెల్జాలకు వచ్చిన ఆయనను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్థానిక రైతులంతా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందేలా చూడాలని అల్వాల్‌రెడ్డి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కార్యదర్శి రవీందర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నర్సింహులు, అజీజ్, అజీం, ఆరిఫ్, రాజవర్ధన్‌రెడ్డి, శశీధర్‌రెడ్డి, శివారెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తప్పుల్లేకుండా సర్వే చేయాలి



యాచారం: ధర్మన్నగూడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం/కేశంపేట/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/షాబాద్/చౌదరిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం ధర్మన్నగూడలో కుటుంబ సర్వేను బుధవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పర్యవేక్షించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. తప్పులు దొర్లకుండా ఇంటి యజమాని కులం వివరాలు, వారి ఆధార్, మొబైల్ నంబర్లు, సాగు భూమి, వృత్తి, వ్యాపారం వంటి వివరాలు సమగ్రంగా రికార్డు చేయాలన్నారు. సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కేశంపేట ప్రత్యేకాధికారి రాజారత్నం అన్నారు. కొత్తపేటలో సర్వేను పరిశీలించారు. వివరాల నమోదులో పొరపాట్లు చేయొద్దన్నారు. సర్వే పత్రాలను భద్రపర్చాలన్నారు. సర్వేలో తప్పులు చేయొద్దని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. 15వ వార్డులో సర్వేను పరిశీలించారు. గ్రామాల్లో ఎంపీడీవో కుసుమమాధురి పర్యవేక్షించారు. కడ్తాల మండల గ్రామాల్లో సర్వేను ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్ పరిశీలించారు. తలకొండపల్లి మండల గ్రామాల్లో సర్వేను ఎంపీడీవో శ్రీకాంత్ పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ అన్నారు. రుద్రారం, నాగర్‌గూడ, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడల్లో సర్వేను పరిశీలించారు. ఆమె వెంట అధికారులు, గ్రామస్తులు ఉన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇంద్రనగర్, చౌదరిగూడ గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి, ముట్పూర్, భైరంపల్లి, టేకులపల్లి మహదేవ్‌పూర్ గ్రామాల్లో సర్వేను ఎంపీడీవో లక్ష్మీఅనురాధ పర్యవేక్షించారు. పొలంపనులు ఉన్నందున్న సర్వే ఆలస్యమైతోందని, ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరిస్తే వేగంగా పూర్తవుతుందన్నారు.



చౌదరిగూడ: కుటుంబ సర్వే వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



షాబాద్:తిమ్మారెడ్డిగూడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో అపర్ణ



చౌదరిగూడ: కుటుంబ సర్వే వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



కేశంపేట: కొత్తపేటలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారత్నం



ఆమనగల్లులో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత

సంక్షిప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యాచారం: మండలంలోని మాల్, యాచారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధుల్లో వైర్ల కింద ఉన్న చెట్ల నరికివేత కారణంగా గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. నేటి ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు.

కొత్తూర్: కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంటు ఉండదని తెలిపారు. అలాగే నందిగామ మండలంలోని న్యాట్కో, రంగాపూర్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. 11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని ఏఈ సూచించారు.

మృతుడి కుటుంబానికి సాయం

ఆమనగల్లు: శివ మాలధారణ భక్తులు తమ ఉదారతను చాటారు. మృతుడి కుటుంబానికి వారు తోచిన ఆయం అందించారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన మల్లేశ్-యాదమ్మల కొడుకు మహేశ్ ఇటీవల చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమనగల్లు శివమాలధారణ భక్తులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శివ మాలధారణ భక్తుల తరపున రూ.22వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, సాయిలు, శ్రీను, జగన్, అశోక్, కుమార్‌గౌడ్, పద్మప్రశాంత్, రాజశేఖర్, సత్యం, సరేశ్, బాలు, శివ, నరేశ్, మహేందర్, మహేశ్, యాది, గణేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట

కడ్తాల్: విద్య, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మన ప్రాంతంలో ఫోర్త్ సిటీ ఏర్పాటుతో కల్వకుర్తి నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. అన్మాస్‌పల్లికి గిరి ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని బుధవారం మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌లతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి ఉపాది పొందుతూ మరి కొందరికి ఉపాధి చూపాలని కోరారు. ఉపాధి పథకాలకు ప్రభుత్వం, బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని ఆయన కోరారు. యువత స్వశక్తితో ఎదగాలని దశరథ్‌నాయక్ అన్నారు. నాయకులు పరమేశ్, రామకృష్ణ, జగన్‌గౌడ్, దేవ్లా, మురళి, వెంకటేశ్, గణేశ్, శ్రీను పాల్గొన్నారు.